# ఒకేసారి 8 వేల మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన

## దేశంలోనే సంచలన నిర్ణయం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్/కరీంనగర్, మే 26: రాష్ట్రవ్యాప్తంగా 8 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో మహిళా సంఘాల భవనాలకు సీఎం శంకుస్థాపన చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, డీఆర్డీవో గీత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, మహిళా సంఘాల ప్రతినిధులు కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళా వారోత్సవాల ద్వారా



మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేశామని, ఇప్పటివరకు ఈ పథకం కోసం రూ.10 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. మహిళలను బస్సుల యజమానులుగా చేసే లక్ష్యంతో వెయ్యి బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు మహిళా సంఘాలతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పెట్రోల్ బంకుల నిర్వహణలో కూడా మహిళా సంఘాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. బ్యాంక్ లింకేజ్ రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నామని, ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల రుణాలు అందించినట్లు సీఎం వెల్లడించారు. సున్నా వడ్డీ రుణాల కోసం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, గోదాములు, లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకునేలా అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేసే స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. “2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం” అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.



# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి...

## బీఆర్ఎస్ నేత అయిలేని మల్లికార్జున రెడ్డి

## హుస్నాబాద్ మండలం పోట్లపల్లిలో రైతుల నిరసన ధర్నా..



హుస్నాబాద్,జనత న్యూస్:ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే వేగవంతంగా సేకరించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలం పోట్లపల్లి గ్రామంలో ధాన్యం సత్వరమే కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం రైతులు నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని రైతులకు మద్దతుగా మాట్లాడారు.రైతులు ఎంతో కష్టపడి, పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకుందామని ఐపీఎంసీ కేంద్రాలకు వస్తే.. రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని మల్లికార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల అకాల వర్షాలు కురుస్తుండటంతో చేతికొచ్చిన పంట కళ్ల ముందే నష్టపోయే పరిస్థితి దాపురించిందన్నారు.సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పోట్లపల్లి కేంద్రంలోని ధాన్యం తడిసిపోయిందని పేర్కొన్నారు.గత 15 రోజులుగా కొనుగోళ్లు సక్రమంగా సాగకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు నిత్యం భయాందోళనల మధ్య గడుపుతున్నారని ఆయన విమర్శించారు.ప్రభుత్వం మాటల్లో గొప్పలు చెప్పుకుంటూ కాలయాపన చేస్తోందే తప్ప, ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తున్న రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి కావాల్సి ఉన్నా, పదిహేను రోజులు ఆలస్యం చేయడం వల్లే రైతులకు ఈ కష్టం వచ్చిందని, కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు యాస శ్రీనివాస్, కొమ్మెర నర్సింహా రెడ్డి, దేవసాని శ్రీనివాస్ రెడ్డిలతో పాటు రైతులు దుద్దుల లింగవ్వ, జిలా కనుకయ్య, మేడవేణి కనుకయ్య, సుంకరి శ్రీనివాస్, శంకర్ బాబు, తాటిపాముల తిరుపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 80 శాతం మొక్కజొన్న కొనుగోలు పూర్తి

## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, మే 26: జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మరో వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఏడు కొనుగోలు కేంద్రాల ద్వారా 560 మంది రైతుల నుంచి 2 లక్షల 10 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇంకా మరో లక్ష క్వింటాళ్ల వరకు మొక్కజొన్న కొనుగోళ్లకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలో గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో ఇప్పటివరకు 18 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేవలం 20 రోజుల్లోనే 36 వేల బ్యాగులను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మే 31 నాటికి జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను 100 శాతం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను గోదాముల్లో భద్రపరుస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ఏడు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, తగినంత స్టోరేజ్ సౌకర్యం అందుబాటులో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిరోజు 15 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

## హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి

## ఘనంగా ప్రారంభమైన మహిళా వారోత్సవాలు



చిగురుమామిడి,జనత న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక’లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తోందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ కరీంనగర్ (రూరల్) ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభమైన ‘మహిళా వారోత్సవాల’ (మే 25 నుండి మే 30 వరకు) తొలిరోజు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పరిధిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారత, గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహార భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. నూతన భవనాల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ ఆరు రోజుల పాటు నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాలను మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ అధికారిని శ్రీలత, పి ఆర్ ఏ ఈ నిరంజన్ రెడ్డి, ఉప సర్పంచ్ కాశవేని విజయ, విద్యా కమిటీ చైర్మన్ గొల్లపల్లి అరుణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టిమల్ల రవీందర్, మురహర్ రెడ్డి, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి ,దోమ శ్రీనివాస్ రెడ్డి, దోమ తిరుపతిరెడ్డి, వంగ కనకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పన్యాల అనురాధ, ధనలక్ష్మి, ఇందిరా, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో పోలీసుల ముమ్మర తనిఖీలు

## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

కరీంనగర్, మే 25: కరీంనగర్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు సోమవారం రాత్రి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ఏసీపీ (టౌన్) ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో కలిసి నగరంలోని పలు లాడ్జీలు, పాన్ షాపులు, రవాణా కార్యాలయాల్లో ఆకస్మిక సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా లాడ్జీల్లో బస చేస్తున్న వారి వివరాలు, రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. పాన్ షాపుల్లో నిషేధిత పదార్థాల విక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో అనుమానాస్పద పార్సిళ్లు, వస్తువులపై డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రత్యేక సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. గస్తీని మరింత ఉధృతం చేయాలని సిబ్బందికి సూచించారు. రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద



కార్యకలాపాలు లేదా వ్యక్తులు గుర్తించబడలేదని పోలీసులు వెల్లడించారు. నగర ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఏసీపీ టౌన్ వెంకటస్వామి, ఎస్సై చేరాలు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి: తెలంగాణ రక్షణ సేన

కరీంనగర్, మే 26: ఉద్యమాలకు ఖిల్లాగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం దురదృష్టకరమని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం లోపే నగరంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, గతంలో తెలంగాణ ఉద్యమకారులు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జంక్షన్ అభివృద్ధి పేరుతో తొలగించినప్పటికీ, ఇప్పటివరకు మళ్లీ ప్రతిష్ఠించలేదని ఆరోపించారు. తొలగించిన విగ్రహం ప్రస్తుతం ఎక్కడ ఉందో కూడా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, ఉద్యమ కాలంలో ఆ విగ్రహం వద్ద ప్రతిజ్ఞలు చేసి అనేక పోరాట కార్యక్రమాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన విగ్రహం జిల్లా కేంద్రంలో లేకపోవడం బాధాకరమని అన్నారు. జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముందే తెలంగాణ తల్లి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com